సాక్షి
నిజామాబాద్
శుక్రవారం । 11 । ఆగస్టు । 2023



అన్ని రంగాల్లో అగ్రగామి తెలంగాణ

తెలంగాణను అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలిపిన ఘనత సీఎం కేసీఆర్‌దేనని మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి అన్నారు.

- 8లో ▸



కాంగ్రెస్ చరిత్ర తెలియని కేటీఆర్

కాంగ్రెస్ చరిత్రను కేటీఆర్ ఆయన తండ్రి కేసీఆర్‌ను అడగాలని టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షులు మహేశ్ గౌడ్ అన్నారు.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం
32.1 /24.9

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. మధ్యాహ్నం మేఘావృతం కావచ్చు. అడపాదడపా చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

మంత్రి కేటీఆర్‌కు అండగా ఉంటా

- ఎమ్మెల్యే బిగాల గణేశ్‌గుప్తా



నిజామాబాద్‌నాగారం : నగర అభివృద్ధిపై ఐటీ, మున్సిపల్ శాఖమంత్రి కేటీఆర్ అభినందించడం సంతోషంగా ఉందని ఎమ్మెల్యే బిగాల గణేశ్‌గుప్తా అన్నారు. ఎల్లవేళల మంత్రి కేటీఆర్‌కు నిబద్ధతతో అండగా ఉంటానని పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన గురువారం ప్రకటన విడుదల చేశారు. ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి కేటీఆర్, ఎమ్మెల్సీ కవిత సహకారంతో నిజామాబాద్ నగరాన్ని అద్భుతంగా తీర్చిదిద్దడానికి ప్రయత్నించానని తెలిపారు. నగరం అభివృద్ధికి రూ.60 కోట్ల నిధులను మంజూరు చేసిన పురపాలక మంత్రి కేటీఆర్‌కు నగర ప్రజల తరఫున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమాలను విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు.

రేవంత్ రెడ్డితో భేటీ



ఖలీల్‌వాడి : టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డితో నిజామాబాద్ నగర మాజీ మేయర్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు ధర్మపురి సంజయ్ గురువారం ఢిల్లీలో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. పార్టీ పటిష్టత, నిర్మాణ పరమైన అంశాలు, రానున్న ఎన్నికల్లో అనుసరించాల్సిన ప్రణాళికలు, చర్యలు, వ్యూహాలపై చర్చించారు. పార్టీ డిక్లరేషన్స్, హామీలపై ప్రజా స్పందనపై విశ్లేషణ చేశారు. రాబోయే రోజుల్లో పార్టీ మరింత బలోపేతానికి, గెలుపునకు కృషి చేయాలని రేవంత్ రెడ్డి సూచించారు. రేవంత్ రెడ్డి సలహాలు, సూచనల మేరకు పని చేయనున్నట్లు పేర్కొన్నారు.

'గృహలక్ష్మి'కి దరఖాస్తుల వెల్లువ



నిజామాబాద్ నాగారం : ప్రభుత్వం ప్రకటించిన 'గృహలక్ష్మి'కి పథకానికి నగరంలోని 60 డివిజన్‌ల నుంచి పెద్ద ఎత్తున దరఖాస్తులు చేసుకున్నారు. మూడు రోజులుగా 400 దరఖాస్తులు మాత్రమే వస్తే, గురువారం చివరి రోజు సుమారు 2500 వరకు దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. మంత్రి ప్రశాంత్‌రెడ్డి గృహలక్ష్మి నిరంతర ప్రక్రియ అని చెప్పినా అధికారికంగా ఉత్తర్వులు రాకపోవడంతో పెద్ద ఎత్తున దరఖాస్తులు వచ్చాయి. ఉదయం 10 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు మున్సిపల్ కార్యాలయంలో దరఖాస్తులు స్వీకరించారు.

వైన్స్ యజమానులకు భారం లేకుండా కొత్త పాలసీ



ఖలీల్‌వాడి : వైన్ షాపుల యజమానులకు భారం కాకుండా ఉండేందుకు ప్రభుత్వం కొత్త మద్యం పాలసీ తీసుకువచ్చిందని ప్రొహిబిషన్, ఎక్సైజ్‌శాఖ డిప్యూటీ కమిషనర్ దశరథం అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎక్సైజ్‌శాఖ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో మద్యం దుకాణాలకు టెండర్లు వేయడానికి ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ నెల 18 వరకు దరఖాస్తులకు అవకాశం ఉందన్నారు. ఈ నెల 21న రాజీవ్‌గాంధీ ఆడిటోరియంలో లక్కీ డ్రా తీస్తామని చెప్పారు. ఉమ్మడి జిల్లాలో నాలుగు స్లాబ్‌లు అమలులో ఉన్నాయని తెలిపారు. రెండు వేల జనాభా నుంచి ఐదు లక్షల జనాభా వరకు ఉన్న మద్యం దుకాణాలకు రూ.50 లక్షల నుంచి రూ.65 లక్షల వరకు చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. గతంలో ఏడు సార్లు మాత్రమే మార్జిన్ ఇచ్చేవారని ఇప్పుడు 10 సార్లకు పెంచారని వివరించారు. గురువారం 25 దరఖాస్తులు వచ్చినట్లు ఎక్సైజ్ సూపరింటెండెంట్ మల్లారెడ్డి తెలిపారు. ఇప్పటి వరకు జిల్లాలో 59 దరఖాస్తులు వచ్చినట్లు చెప్పారు.

భూ కైలాస్..

రాష్ట్ర రాజధాని కోకాపేటలో భూమి ధర ఎకరం రూ.100 కోట్లు పలికింది. ఈ నేపథ్యంలో భూముల ధరల విషయమై సర్వత్రా చర్చ జరుగుతోంది. నిజామాబాద్ జిల్లాలోనూ భూ లావాదేవీలకు సంబంధించి కథలు కథలుగా చెప్పుకుంటున్నారు. జిల్లా కేంద్రం మొదలు మారుమూల మండలాల్లో సైతం కమర్షియల్, రెసిడెన్షియల్, వ్యవసాయ భూములు భారీ ధరలు పలుకుతున్నాయి. ప్రభుత్వ నిర్దేశిత ధరలకు మించి అనేక రెట్లు ఎక్కువగా ధరలు ఉండటం గమనార్హం. – సాక్షి ప్రతినిధి, నిజామాబాద్

- జిల్లా వ్యాప్తంగా భూముల ధరలకు రెక్కలు
- నగరంతో పాటు మారుమూల మండలాల్లోనూ..
- బహిరంగ మార్కెట్‌లో ఇళ్ల జాగాలు, వ్యవసాయ భూములకు డిమాండ్
- నగర శివార్లు హైదరాబాద్, ఆర్మూర్ రోడ్లలో ఎకరం సుమారు రూ.7 కోట్లు
- నిజామాబాద్ ఖలీల్‌వాడిలో ఇటీవల గజం రూ.1.70 లక్షలకు విక్రయం
- బోధన్, ఆర్మూర్‌లలో నడిబొడ్డున గజం విలువ రూ.1.50 లక్షలు
- సిరికొండ, ధర్పల్లి, ఇందల్వాయిలలో గజానికి రూ.50 వేలు పలికిన ధర



■ నిజామాబాద్ నగరంలోని కీలకమైన ఖలీల్‌వాడి కమర్షియల్ ప్రాంతంలో ఇటీవల గజం రూ.1.70 లక్షల చొప్పున 300 గజాల స్థలం అమ్ముడుపోయింది. అదేవిధంగా బోధన్ బస్‌స్టేషన్, ఆర్మూర్ డాక్టర్స్ కాలనీలో గజం రూ.1.50 లక్షలకు విక్రయించారు. పెర్కిట్‌లో గజం రూ.1లక్షకు అమ్మకం చేశారు. అయితే ప్రభుత్వ ధర ప్రకారం నిజామాబాద్‌లో గజం రూ.35వేలు, ఆర్మూర్‌లో గజం రూ.9,800, బోధన్‌లో గజం రూ.15,900 ఉంది. క్రయవిక్రయాల్లో మాత్రం వీటికి అనేక రెట్లు ధర పెడుతున్నారు. నిజామాబాద్‌లోని ఆర్మూర్, హైదరాబాద్ వెళ్లే వైపు రోడ్లలో కమర్షియల్ స్థలాలు గజం రూ.2 లక్షల వరకు పలుకుతున్నాయి.

■ నిజామాబాద్ రూరల్ మండలం గూపన్‌పల్లి, పాంగ్రా, బోర్గం(పి), మాధవనగర్‌లో ఎకరం భూమి రూ.7 కోట్ల వరకు పలుకుతోంది. ఇదిలా ఉండగా ఇటీవల కంఠేశ్వర్ బైపాస్‌లో ఒక వ్యక్తి రూ.8.5 కోట్లు వెచ్చించి గజం రూ.55 వేల చొప్పున జాగాను కొనుగోలు చేశాడు. ఇక జాతీయ రహదారులు ఆనుకుని, వివిధ మండల కేంద్రాల్లో భూములు రూ.3 నుంచి రూ.4కోట్ల వరకు పలుకుతున్నాయి.

■ డిచ్‌పల్లి మండల కేంద్రంలో గజం ధర రూ.50 వేల నుంచి రూ.70 వేల వరకు పలుకుతోంది. ఇక డిచ్‌పల్లి మండలం ధర్మారం–నడిపల్లి మధ్య ఎకరం భూమి రూ.4 కోట్లు పలుకుతోంది. రూరల్ మండలం నాగారం ఆర్టీవో కార్యాలయం నుంచి మల్లారం గండి వరకు ఎకరం రూ.1కోటి నడుస్తోంది. ముబారక్‌నగర్–దాస్‌నగర్ ప్రాంతంలో ఎకరం రూ.3 కోట్లు పలుకుతుండగా, మెయిన్ రోడ్డుకు మాత్రం గజం ధర రూ.50 వేలు పలుకుతోంది. ఖానాపూర్–కాలూరు, సారంగపూర్ చక్కెర ఫ్యాక్టరీ–జన్నేపల్లి క్రాస్‌రోడ్డు వరకు ఎకరం రూ.1.50 కోట్ల నుంచి రూ.1.80 కోట్ల వరకు నడుస్తోంది. జక్రాన్‌పల్లి మండలం అర్గుల్ వద్ద జాతీయ రహదారి పక్కన ఎకరం రూ.3 కోట్లు, బ్రాహ్మణపల్లి వద్ద ఎకరం రూ.2నుంచి 3కోట్లు పలుకుతోంది.

■ ధర్పల్లి మండల కేంద్రంలో గజం ధర రూ.1 లక్ష వరకు పలుకుతోంది. ఇక్కడ ప్రభుత్వ ధర మాత్రం కేవలం రూ.600 మాత్రమే ఉండడం గమనార్హం. ఇందల్వాయి, సిరికొండ మండల కేంద్రాల్లో గజం ధర రూ.50 వేల వరకు నడుస్తోంది. కాగా ధర్పల్లి, ఇందల్వాయి మండలాల్లో ఎకరం ధర రూ.1.20 కోట్ల నుంచి రూ.1.50 కోట్ల వరకు పలుకుతోంది. సిరికొండ మండలంలో ఎకరం ధర రూ.30 లక్షల నుంచి రూ.40 లక్షల వరకు పలుకుతోంది. ఇలా చెప్పుకుంటూ పోతే జిల్లాలోని ఏ మండలం చూసినా వ్యవసాయం, వాణిజ్య, నివాస స్థలాల భూముల ధరలు భారీగా పలుకుతున్నాయి.

భూముల ధరలు (గజానికి రూ.లలో)

ప్రాంతం	ప్రభుత్వం నిర్ణయించిన ధర	ప్రైవేటులో పలుకుతున్న ధర
నిజామాబాద్	35,000	1,70,000
ఆర్మూర్	9,800	1,50,000
బోధన్	15,900	1,50,000

ఏప్రిల్–జూలై మాసాల్లో జిల్లాలో రిజిస్ట్రేషన్లు ఇలా..

	డాక్యుమెంట్లు	ఆదాయం (రూ.కోట్లలో)
గత ఏడాది	14,449	41.95
ఈ ఏడాది	14,954	43.93

విజిలెన్స్ నివేదిక వచ్చాకే..



ఈసీ సమావేశంలో తెయూ ఇన్‌చార్జి వీసీ వాకాటి కరుణ, రిజిస్ట్రార్ యాదగిరి, సభ్యులు

- మాజీ రిజిస్ట్రార్లపై చర్యలు
- కాంట్రాక్టు అధ్యాపకుడి తొలగింపు
- పీహెచ్‌డీపై విచారణ కోసం ఉన్నత విద్యామండలికి లేఖ
- తెయూ ఈసీ సమావేశంలో తీర్మానాలు

తెయూ (డిచ్‌పల్లి) : తెలంగాణ యూనివర్సిటీ మాజీ వీసీ ప్రొఫెసర్ డి రవీందర్ హయాంలో జరిగిన అక్రమాలపై ఎన్‌ఫోర్స్‌మెంట్ అండ్ విజిలెన్స్ అధికారుల విచారణ నివేదిక అందిన తర్వాతే మాజీ ఇన్‌చార్జి రిజిస్ట్రార్లు ప్రొఫెసర్ విద్యావర్ధిని, ప్రొఫెసర్ కనకయ్యలపై చర్యలు తీసుకోవాలని వర్సిటీ పాలకమండలి (ఈసీ) తీర్మానం చేసింది. 62 వ ఈసీ సమావేశం హైదరాబాద్‌లోని రూసా భవనంలో గురువారం రాష్ట్ర విద్యాశాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ, తెయూ ఇన్‌చార్జి వీసీ వాకాటి కరుణ అధ్యక్షతన జరిగింది. అజెండా అంశాలపై చర్చించి పలు తీర్మానాలను ఏకగ్రీవంగా ఆమోదించారు.

తీర్మానాల వివరాలు..

- ఎరియర్స్ పేరిట అక్రమంగా రూ.10 లక్షలు తీసుకున్న కాంట్రాక్టు అధ్యాపకుడు శ్రీనివాస్‌ను విధుల నుంచి శాశ్వతంగా తొలగించడంతో పాటు డబ్బులు రికవరీ చేయాలి. లేదంటే శ్రీనివాస్‌పై క్రిమినల్ కేసు నమోదు చేయాలి.
- ఇటీవల నిర్వహించిన క్యాస్ (కేరీర్ అడ్వాన్స్ స్కీం)లో పదోన్నతులు పొందిన అధ్యాపకులకు నియామకపు ఉత్తర్వులు అందజేయాలి. అర్హత గల అధ్యాపకులకు పదోన్నతులు కల్పించేందుకు కొత్తగా క్యాస్ నోటిఫికేషన్ వేయాలి.
- 2022 –23లో నిర్వహించిన పీహెచ్‌డీ అడ్మిషన్లతో పాటు తెలుగు విభాగంలో పుప్పాల రవీందర్ కు ప్రదానం చేసిన పీహెచ్‌డీ డాక్టరేట్ అవార్డుపై విచారణ కోసం కమిటీ నియామకానికి రాష్ట్ర ఉన్నత విద్యామండలికి లేఖ రాయాలి. 2014 రిక్రూట్‌మెంట్ అధ్యాపకులకు క్యాస్ పదోన్నతుల అంశం పై మరోసారి లీగల్ అడ్వయిజ్ కోసం ప్రభుత్వానికి లేఖ రాయాలి. అవుట్‌సోర్సింగ్ సిబ్బందికి ఎలాంటి పదోన్నతులు కల్పించరాదు. ప్రభుత్వ అనుమతి లేకుండా ఎలాంటి ఖాళీలు భర్తీ చేపట్టరాదు.
- రిజిస్ట్రార్‌గా ప్రొఫెసర్ యాదగిరి నియామకానికి ఆమోదం. ఇటీవల చేపట్టిన పరిపాలనా పదవుల నియామకాలకు ఆమోదం. రిజిస్ట్రార్‌గా యాదగిరి బాధ్యతలు చేపట్టిన తర్వాత బోధన, బోధనేతర సిబ్బంది జీతాలు, ఇతర అన్ని రకాల చెల్లింపులకు ఆమోదం.
- ఈసీ సమావేశంలో రాష్ట్ర ఆర్థికశాఖ డిప్యూటీ డైరెక్టర్ చంద్రకళ, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ యాదగిరి, ప్రొఫెసర్ నసీమ్, ప్రొఫెసర్ ఆరతి, కె రవీందర్‌రెడ్డి, వసుంధర దేవి, మారయ్యగౌడ్, గంగాధర్‌గౌడ్, ప్రవీణ్‌కుమార్, ఎస్ఎల్‌శాస్త్రి హాజరు కాగా రాజేందర్‌రెడ్డి గైర్హాజరయ్యారు. ఈసీ సమావేశంలో అజెండా అంశాలపై సుమారు రెండున్నర గంటల పాటు సభ్యులు చర్చ కొనసాగించారు.

ఎస్సారెస్పీకి పెరిగిన వరద

బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు గురువారం వరద పెరిగింది. ఎగువ ప్రాంతాల నుంచి 13,285 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. ప్రాజెక్ట్ నుంచి కాకతీయ కాలువ ద్వారా 5500 క్యూసెక్కులు, లక్ష్మికాలువ ద్వారా 100 క్యూసెక్కులు, సరస్వతి కాలువ ద్వారా 300 క్యూసెక్కులు, గుత్ప లిప్టు ద్వారా 135 క్యూసెక్కులు, అలీసాగర్ ద్వారా 180 క్యూసెక్కులు, మిషన్ భగీరథ ద్వారా 152 క్యూసెక్కులు, ఆవిరి రూపంలో 628 క్యూసెక్కుల నీరు పోతోంది. ప్రాజెక్ట్ ఇన్‌ఫ్లో కంటే ఔట్‌ఫ్లో తక్కువగా ఉండటంతో ప్రాజెక్ట్ నీటి మట్టం క్రమంగా పెరుగుతోంది.

అర్ధరాత్రి ఆర్డర్లు..

- రాత్రి రిలీవ్.. ఉదయం జాయినింగ్
- పాత తేదీలతో వీఆర్ఏలకు లెటర్లు



మోపాల్ తహసీల్ కార్యాలయంలో వీఆర్ఏలకు ఆర్డర్ కాపీలు ఇస్తున్న అధికారులు

సుభాష్‌నగర్ : వీఆర్ఏ వ్యవస్థ రద్దు చేసి ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి వివిధ శాఖల్లో సర్దుబాటు చేసిన గ్రామ రెవెన్యూ సహాయకులకు గురువారం అర్ధరాత్రి ఆర్డర్లు అందజేశారు. వీఆర్ఏల సర్దుబాటును నిలిపేయడంతోపాటు ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వులను సస్పెండ్ చేస్తూ హైకోర్టు తీర్పునిచ్చిన నేపథ్యంలో పాత తేదీలతో జాయినింగ్ లెటర్లు ఇస్తున్నారు. వీఆర్ఏలకు ఆర్డర్ కాపీలను సమావేశాలు ఏర్పాటు చేసి మంత్రుల చేతుల మీదుగా ఇచ్చేలా ప్రణాళికలు చేసుకున్నారు. జిల్లాలో నగరశివారులోని ఓ ఫంక్షన్‌హాల్‌లో శుక్రవారం ఇచ్చేందుకు ఏర్పాట్లు చేశారు. కోర్టు తీర్పు నేపథ్యంలో వీఆర్ఏలను రాత్రికి రాత్రి తహసీల్దార్ కార్యాలయాలకు పిలిపించుకుని ఆర్డర్ కాపీలు అందజేశారు.

ఇతర జిల్లాలకు 201 మంది

జిల్లా వ్యాప్తంగా 1643 మంది వీఆర్ఏలు విధులు నిర్వర్తిస్తున్నారు. 1,223 మందిని వివిధ శాఖల్లో సర్దుబాటు చేసిన విషయం తెలిసిందే. మరో 420 మంది వారసులకు ఉద్యోగాలపై స్పష్టత లేకపోవడంతో వారికి నిలిపేశారు. జిల్లాలోని అన్ని మండలాల నుంచి ఏడుగురు చొప్పున 201 మందిని వివిధ జిల్లాలకు కేటాయించారు. వారిని రాత్రికి రాత్రి ఇక్కడి నుంచి రిలీవ్ అయి ఉదయం కల్లా జాయిన్ కావాలని అధికారులు మౌఖిక ఆదేశాలిచ్చారు. అయితే ఇతర జిల్లాలకు కేటాయించిన వారు ఈ హఠాత్పరిణామంతో గందరగోళానికి గురవుతున్నారు. కొందరు ఆర్డర్ కాపీలు తీసుకునేందుకు సంశయిస్తున్నారు. కాగా వేరే జిల్లాలకు కేటాయించిన వారి ఆర్డర్ కాపీలు రాత్రికి రాత్రే ఆయా జిల్లాలకు పంపించినట్లు విశ్వసనీయంగా తెలిసింది. ఉద్యోగులు వెళ్లక ముందే ఆర్డర్ కాపీలు చేరడంపై విస్మయానికి గురవుతున్నారు.

పకడ్బందీగా వ్యవసాయ కమతాల గణన

కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు

సుభాష్‌నగర్ : పదకొండో వ్యవసాయ కమతాల గణన పకడ్బందీగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో వ్యవసాయ కమతాల గణనపై శిక్షణాతరగతులను నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ 2021–22 సంవత్సర ప్రాతిపదికగా ప్రతి రెవెన్యూ గ్రామంలో వ్యవసాయ కమతాల వారీగా విస్తీర్ణం, సాగుదారుని వివరాలు, ఏయే పంటలు పండిస్తున్నారు, నీటి వినియోగం, సాగునీటి వనరులు తదితర వివరాలు రైతుల ద్వారా సేకరించాలని సూచించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈనెల 20 లోపు ఖచ్చితమైన వివరాలతో సర్వే పూర్తి చేయాలన్నారు. సేకరించిన వివరాలను ప్రత్యేకంగా రూపొందించిన యాప్ ద్వారా స్మార్ట్‌ఫోన్ వినియోగంతో అధికారిక సైట్‌లో అప్‌లోడ్ చేయాలని వ్యవసాయ విస్తీర్ణాధికారులకు సూచించారు. జిల్లాలోని 450 రెవెన్యూ గ్రామాల్లో 108 మంది గణకులు, 28 మంది సూపర్‌వైజర్లు, 22 మంది మండల వ్యవసాయ అధికారులు, 25 మంది మండల గణాంక అధికారులు సర్వేలో పాల్గొంటారని కలెక్టర్ తెలిపారు. అనంతరం వ్యవసాయ కమతాల గణన ఉద్దేశాలు, సర్వే పాదాల నిర్వచనాలు అర్థ గణాంక శాఖ, హైదరాబాద్ నుంచి హాజరైన సహాయ సంచాలకులు శ్రీవల్లి, ఉప గణాంక అధికారులు సుధ, పులి రాజు వివరిస్తూ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ముఖ్య ప్రణాళిక అధికారి డి బాబురావు, జిల్లా వ్యవసాయశాఖ అధికారి వాజిద్ హుస్సేన్ పాల్గొన్నారు.

పంద్రాగస్టు వేడుకలకు ఏర్పాట్లు



మాట్లాడుతున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు

సుభాష్‌నగర్ : స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో అన్ని శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. వివిధ వర్గాల వారి కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు ప్రతిబింబించేలా జిల్లా ప్రగతి నివేదిక రూపొందించాలన్నారు. వ్యవసాయ, ఉద్యానవన, జిల్లా గ్రామీణాభివృద్ధి, ఫారెస్ట్, పశు సంవర్ధక, విద్య, వైద్యం, స్త్రీ శిశు సంక్షేమం తదితర శాఖల పనితీరును చాటేలా స్టాల్స్ ఏర్పాటు చేయాలన్నారు. ఉత్తమ ఉద్యోగుల ఎంపిక కోసం శాఖల వారీగా ప్రతిపాదనలు పంపించాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ పి యాదిరెడ్డి, నిజామాబాద్ నగర పాలక సంస్థ కమిషనర్ ఎం మకరంద్, అదనపు డీసీపీ జయరాం, జెడ్పీ సీఈవో గోవింద్, కలెక్టరేట్ ఏఓ ప్రశాంత్, వివిధ శాఖల జిల్లాస్థాయి అధికారులు పాల్గొన్నారు.

భయం.. భయంగా !

మందుబాబుల ఆగడాలు మితిమీరుతున్నాయి. వైన్స్‌లకు అనుబంధంగా పర్మిట్ రూమ్‌లు ఉండడంతో అక్కడ రోడ్డుపై వెళ్లే వారు మందుబాబులతో ఇబ్బందులకు గురవుతున్నారు. 'సాక్షి' గురువారం రాత్రి 7 గంటల నుంచి 8 గంటల వరకు నగరంలోని పలు వైన్స్‌ల వద్ద పరిశీలన చేయగా అనేక అంశాలు వెలుగులోకి వచ్చాయి. మందుబాబులు కొందరు వైన్స్‌ల ఎదుటనే మందు సేవించారు. ఇదే సమయంలో మహిళలు, యువతులు తమ కుటుంబ సభ్యులతో కలిసి రోడ్డుపై వెళ్తూ వైన్స్‌ల వద్దకు రాగానే ఇబ్బందికరంగా ఫీలయ్యారు.

SAKSHI VISIT సాక్షి విజిట్

ప్రధాన రోడ్లపైనే వైన్స్‌లు

- దుకాణాల వద్దే మద్యం సేవిస్తున్న మందుబాబులు
- రోడ్డున వెళ్లేవారికి తప్పని న్యూసెన్స్
- ఆ ప్రాంతం నుంచి వెళ్లాలంటేనే భయపడుతున్న మహిళలు



దుబ్బ చౌరస్తా నుంచి ఖానాపూర్ చౌరస్తాకు వెళ్లే వైన్సు వద్ద..



వినాయక్‌నగర్‌లో ప్రధాన రోడ్డుపై ఉన్న ఓ వైన్స్ వద్ద భయపడుతూ వెళుతున్న మహిళ

నిజామాబాద్ అర్బన్/సుభాష్‌నగర్/ఖలీల్‌వాడి/నిజామాబాద్‌నాగారం/నిజామాబాద్‌సిటీ : నిజామాబాద్ నగరంలోని దుబ్బ ప్రాంతంలో మార్కెట్ కమిటీ దగ్గరగా ఉండడం వల్ల అక్కడ ఉన్న ఓ వైన్స్ వద్ద నిత్యం కూలీలు, ఇతరులతో రద్దీగా ఉంటుంది. దుబ్బ ప్రాంతానికి ప్రధాన రోడ్డు కావడంతో జన సమూహం కూడా రోడ్డుపై అధికంగా వెళ్తుంది. ఇక్కడ నిత్యం మద్యం సేవించిన వారు వచ్చిపోయే వారిని వేధింపులకు గురిచేస్తున్నారు. రాత్రివేళల్లో ఇబ్బందికరంగా ఉంటుంది. కంఠేశ్వర్ నుంచి ముబారక్‌నగర్ వరకు నాలుగు వైన్‌షాపులు ఉన్నాయి. ఇవి ప్రధాన రోడ్డుపైనే ఉండడంతో జనసమూహం ఎక్కువగా ఉంటుంది. వీటి పక్కనే ఉన్న షాపులకు వచ్చే వారి సంఖ్య ఎక్కువగా ఉంటుంది. ఇక్కడ తరచుగా వివాదాలు జరుగుతున్నాయి. సుభాష్‌నగర్‌లోని జనసమూహం ప్రాంతంలో ఉన్న ఓ వైన్స్ వద్ద ప్రతి రోజు గొడవలు జరుగుతున్నాయి. నివాస గృహాలు ఎక్కువగా ఉన్నచోట ఈ వైన్స్ ఉంది. పూలాంగ్, వినాయక్‌నగర్ , బోర్గాం ప్రాంతంలో ఉన్న వైన్స్‌ల వద్ద అధిక రద్దీ ఉంటోంది. ఇక్కడ కూడా తరచుగా గొడవలు జరుగుతున్నాయి. వర్ని చౌరస్తా, పెద్దబజార్, నాగారం ప్రాంతంలో స్లమ్ ఏరియా కావడంతో వైన్స్‌ల వద్ద ప్రతి రోజు రాత్రి కోలాహలంగా ఉంటుంది. ఇక్కడ కూడా తరచుగా గొడవలు జరుగుతున్నాయి. నగరంలో గౌతంనగర్, జన్మభూమి రోడ్డు, రైల్వేస్టేషన్ ప్రాంతాలు జన సమూహం అధికంగా ఉన్న ప్రాంతాల్లో కాగా గొడవలు కూడా జరిగాయి.

261 మందికి లైన్‌క్లియర్

- జూనియర్ పంచాయతీ కార్యదర్శుల రెగ్యులరైజేషన్ జాబితా సిద్ధం
- జిల్లాలో 269 మందికి నాలుగేళ్ల ప్రొబేషనరీ పీరియడ్ పూర్తి
- ఎనిమిది మందికి మార్కులు తక్కువ రావడంతో అడ్డంకులు
- జేపీఎస్‌లకు త్వరలోనే జారీ కానున్న ఉత్తర్వులు

మోర్తాడ్ : ఎప్పుడెప్పుడా అని క్రమబద్ధీకరణ ఉత్తర్వుల కోసం ఎదురు చూస్తున్న జూనియర్ పంచాయతీ కార్యదర్శులకు ఎట్టకేలకు ప్రభుత్వం శుభవార్తను అందించింది. నాలుగేళ్ల ప్రొబేషనరీ పీరియడ్‌ను ముగించుకుని విధి నిర్వహణలో 70 శాతం పైగా మార్కులు సాధించిన జేపీఎస్‌లను రెగ్యులరైజ్ చేయడానికి జిల్లా స్థాయిలో నియమించిన కమిటీ ప్రభుత్వానికి నివేదికను అందించనుంది.

జిల్లాలోని 269 మంది జేపీఎస్‌లకుగాను 261 మందికి రెగ్యులరైజ్‌కు లైన్ క్లియర్ కానుంది. జిల్లా అదనపు కలెక్టర్ చిత్రామిశ్రా ఆధ్వర్యంలోని కమిటీ జేపీఎస్‌ల పనితీరును గుర్తించి క్రమబద్ధీకరణకు అర్హులైన జాబితాను సిద్ధ చేస్తోంది. పంచాయతీల్లో హరితహారం, పన్నుల వసూళ్లు, పారిశుద్ధ్యం, పల్లె ప్రగతి, స్వచ్ఛ భారత్ ఇతరత్రా పనులను విజయవంతం చేసిన వారికి మార్కులు ఇవ్వాలని ప్రభుత్వం నిర్దేశించింది. వంద మార్కులకు గాను 70 మార్కులు వచ్చినవారినే రెగ్యులరైజ్ చేయడానికి అవకాశం ఉందని ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాలలో పేర్కొన్నారు. జిల్లాలో 530 గ్రామ పంచాయతీలకు గాను 391 మంది జేపీఎస్‌లు పని చేస్తున్నారు. వీరిలో 269 మంది నాలుగేళ్ల ప్రొబేషనరీ పీరియడ్‌ను పూర్తి చేసుకున్నారు.

261 మందిని రెగ్యులరైజ్ చేయాలని కమిటీ నివేదికను సిద్ధం చేసింది. మరో 8 మంది పనితీరు ఇంకా మెరుగుపడాల్సి ఉండటంతో వారిని రెగ్యులరైజ్ చేయడానికి కొంత సమయం పట్టే అవకాశం ఉంది. క్రమబద్ధీకరణ జాబితాలో లేని జేపీఎస్‌లు వారి పనితీరును మెరుగుపరచుకుని కమిటీ మన్ననలను పొందాల్సి ఉంది. ఆలస్యంగా విధుల్లో చేరిన జేపీఎస్‌లు నాలుగేళ్ల ప్రొబేషనరీ పీరియడ్‌ను పూర్తి చేసుకోవాల్సి ఉంది. ఆ తరువాత వారిని కూడా ఇప్పటి విధానంలోనే రెగ్యులరైజ్ చేయడానికి ఆదేశాలు ఇవ్వనున్నారని స్పష్టమైతుంది.

పనితీరు ఆధారంగానే..

జేపీఎస్‌ల పనితీరు ఆధారంగానే క్రమబద్ధీకరణకు కమిటీ ఎంపిక చేసింది. ప్రస్తుతం 261 మంది జేపీఎస్‌లు రెగ్యులరైజ్ చేయబడనున్నారు. దశల వారీగా మిగిలిన జేపీఎస్‌లు కూడా రెగ్యులరైజ్ చేయబడుతారు. ఇప్పటి నిబంధనలే ముందు ముందు అమలు అవుతాయి.

– జయసుధ, జిల్లా పంచాయతీ అధికారి

క్లుప్తంగా

'తెలుగు'లో నర్సింహస్వామికి డాక్టరేట్



తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ విశ్వవిద్యాలయం తెలుగు అధ్యయనశాఖ పరిశోధక విద్యార్థి ఎం నర్సింహస్వామి డాక్టరేట్ సాధించారు. ఇటీవల గుండెపోటుతో మరణించిన ఆచార్య గుమ్మన్నగారి బాలశ్రీనివాస మూర్తి పర్యవేక్షణలో 'డా. వెలిచాల కొండలరావు జీవితం – వాఙ్మయ సేవ' అనే అంశంపై నర్సింహస్వామి పరిశోధన చేశారు. గురువారం తెయూ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ మినీ సెమినార్ హాల్‌లో వైవా నిర్వహించి పీహెచ్‌డీ అందజేశారు. వైవాకు బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం తెలుగు విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ రజని ఎక్స్‌టర్నల్ ఎగ్జామినర్‌గా వ్యవహరించారు. ఆర్ట్స్ డీన్ కనకయ్య, బీవోఎస్ చైర్మన్ త్రివేణి, విభాగాధిపతి కె లావణ్య, అసిస్టెంట్ ప్రొఫెసర్ లక్ష్మణచక్రవర్తి పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ అధ్యాపకులను రెగ్యులరైజ్ చేయాలని వినతి



తెయూ(డిచ్‌పల్లి): రాష్ట్ర ఉన్నత విద్యామండలి వైస్ చైర్మన్, బాసర ట్రిపుల్ ఐటీ వీసీ వెంకటరమణను గురువారం తెలంగాణ యూనివర్సిటీ కాంట్రాక్టు అధ్యాపకులు (అకడమిక్ కన్సల్టెంట్లు) కలిశారు. కాంట్రాక్టు అధ్యాపకుల రెగ్యులరైజ్ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. కాంట్రాక్టు అధ్యాపకులు దత్తహరి, గంగకిషన్, నాగేశ్వరరావు, కిరణ్ రాథోడ్, నాగేంద్రబాబు తదితరులున్నారు.

నియామకం



నిజామాబాద్ నాగారం : మాజీ ఎమ్మెల్సీ రాజేశ్వరరావు క్రిస్టియన్ మైనారిటీ చైర్మన్ గా గురువారం నియమితులయ్యారు. హైదరాబాద్‌లో ఈ సందర్భంగా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ కవిత, ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్, ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్ రాజీవ్ సాగర్, జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు ఈగ సంజీవ్ రెడ్డి తదితరులు రాజేశ్వరరావును అభినందించారు.

పేకాట స్థావరంపై దాడి

కామారెడ్డి క్రైం: కామారెడ్డి మండలం రాగాపూర్ సమీపంలో వ్యవసాయ క్షేత్రంలో పేకాడుతున్న ఐదుగురిని పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి రూ.13,300, ఐదు సెల్ ఫోన్లు, 2 బైక్‌లను స్వాధీనం చేసుకున్నట్లు దేవునిపల్లి ఎస్సై రాజు తెలిపారు.

పిల్లలతో తల్లి అదృశ్యం

నిజామాబాద్ సిటీ: నిజామాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని నీలకంఠనగర్‌కు చెందిన వివాహిత ఇద్దరు పిల్లలతో అదృశ్యమైనట్లు పోలీసులు తెలిపారు. నీలకంఠనగర్‌కు చెందిన ఉరుసు లక్ష్మి కూతురు రజితకు వర్నికి చెందిన సాయిలుతో వివాహం అయింది. వీరికి ఇద్దరు పిల్లలు శ్రీకాంత్(4), అవంతిక(2) ఉన్నారు. సాయిలుతో గొడవపడి కొన్ని రోజుల క్రితం రజిత తల్లి వద్దకు వచ్చింది. ఈ నెల 4న లక్ష్మి పనికి వెళ్లి వచ్చే సరికి రజిత ఆమె పిల్లలు కనిపించలేదు. పలుచోట్ల గాలించినా ఆచూకీ లభించకపోవడంతో ఆమె గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

కాంగ్రెస్ చరిత్ర తెలియని కేటీఆర్

- నిజామాబాద్ నగర అభివృద్ధికి బీఆర్ఎస్ చేసింది శూన్యం
- టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్



మాట్లాడుతున్న టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్‌కుమార్ గౌడ్, డీసీసీ అధ్యక్షుడు మోహన్‌రెడ్డి

ఖలీల్‌వాడి : రాజకీయాల్లో కేటీఆర్ ఒక బచ్చా అని, కాంగ్రెస్ పార్టీ చరిత్ర, దేశ అభివృద్ధి కోసం చేసిన కృషి గురించి వాళ్ళ తండ్రి కేసీఆర్‌ను అడిగితే తెలుస్తుందని టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షులు మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. గురువారం జిల్లా కాంగ్రెస్ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. నిజామాబాద్‌ను అన్ని విధాల అభివృద్ధి చేసింది కాంగ్రెస్ పార్టీయేనని, బీఆర్ఎస్ చేసింది శూన్యమని విమర్శించారు. జిల్లా పర్యటనలో కేటీఆర్ అహంకార పూరితంగా మాట్లాడారన్నారు. తెలంగాణ కాంగ్రెస్ నేతలు సోనియాగాంధీ, మన్మోహన్‌సింగ్‌తో మాట్లాడి ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం కృషి చేశారన్నారు. ఇందులో కేసీఆర్ పాత్ర చాలా చిన్నదన్నారు. తెలంగాణ ఉద్యమం జరుగుతున్నప్పుడు అమెరికా నుంచి కేటీఆర్, కవితకు దిగినట్లు చెప్పారు. వీరికి తెలంగాణ ఉద్యమానికి ఎలాంటి సంబంధం లేదన్నారు. కేసీఆర్ పేరును అడ్డం పెట్టుకొని రాజకీయంగా ఎదిగారే తప్ప నిజానికి కేటీఆర్, కవితకు అంత సీన్ లేదన్నారు. తెలంగాణలో కేసీఆర్ కుటుంబం కొన్ని రూ. లక్షల కోట్ల అవినీతికి పాల్పడిందని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ పేరును ఉచ్చరించే అర్హత కేటీఆర్‌కు లేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వాల హయాంలోనే జిల్లాకు కాళేశ్వరం 20, 21వ ప్యాకేజీ పనులు, గుత్ప, అలీసాగర్ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్‌ల ద్వారా జిల్లా ప్రజలకు తాగునీటి, సాగునీటిని అందించామన్నారు. జిల్లాలో మెడికల్ కాలేజీతో పాటు ప్రతిష్టాత్మక తెలంగాణ విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేశామని గుర్తు చేశారు. ఎమ్మెల్సీ కవిత, అర్బన్ ఎమ్మెల్యే బిగాల గణేశ్ గుప్తా ఐటీ హబ్ పేరుతో వాటి చుట్టు పక్కల ఉన్న భూములను కొనుగోలు చేసి రియల్ ఎస్టేట్ వ్యాపారానికి తెర లేపారని ఆరోపించారు. నిజామాబాద్ నగరంలోని 50 వేల మంది డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల కోసం దరఖాస్తు చేసుకుంటే ఎంతమందికి డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు ఇచ్చారో సమాధానం చెప్పాలన్నారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను ప్రజలు సాగనంపే రోజులు దగ్గర పడ్డాయని గ్రహించి కేటీఆర్ కాంగ్రెస్‌పై విషయం చిమ్మే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి, టీపీసీసీ ఉపాధ్యక్షులు తాహెర్‌బిన్‌హందాన్, కాంగ్రెస్ సీనియర్ నేతలు బాడ్సి శేఖర్ గౌడ్, రామర్తి గోపి, ఎస్‌ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షులు వేణు రాజ్, విపుల్‌గౌడ్, చందూర్ జెడ్పీటీసీ అంబర్ సింగ్, దయాకర్ గౌడ్, చందూర్ వైస్ ఎంపీపీ దశ గౌడ్, ఎంసీసీ అధ్యక్షుడు శ్రీనివాస్, అబ్దుల్ ఏజాజ్, రామకృష్ణ, సిరికొండ గంగారెడ్డి, నాగరాజు, ముస్తాఫా పాల్గొన్నారు.

కార్మిక సంఘాల మహాధర్నా

సుభాష్‌నగర్ : కేంద్ర ప్రభుత్వం ఉద్యోగ, కార్మిక వ్యతిరేక విధానాలను అనుసరిస్తోందని, క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో బీజేపీని తరిమికొట్టి దేశాన్ని కాపాడుకుందామని కార్మిక సంఘాల జేఏసీ పిలుపునిచ్చింది. దేశవ్యాప్త మహాధర్నాలకు పిలుపునిచ్చిన నేపథ్యంలో గురువారం రెండోరోజు కలెక్టరేట్ ఎదుట మహా ధర్నా నిర్వహించారు. ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కడారి సునీల్, సీఐటీయూ, ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శులు నూర్జహాన్, సుధాకర్, దాస్, వర్దయ్య మాట్లాడుతూ బీజేపీ కేంద్ర ప్రభుత్వం జాతీయ సహజ వనరులు, ప్రభుత్వ రంగ సంస్థలను కారుచౌకగా స్వదేశీ, విదేశీ కార్పొరేట్లకు అమ్మేస్తోందని, డీజిల్, పెట్రోల్, వంటగ్యాస్, ఇతర నిత్యావసర వస్తువుల ధరలు పెంచి ప్రజల నడ్డి విరుస్తుందని విమర్శించారు. నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, రైతాంగానికి కనీస మద్దతు ధరలు ప్రకటించాలని, కాంట్రాక్ట్ విధానం రద్దు చేసి పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. మహాధర్నాకు వామపక్ష పార్టీల నాయకులు ఎ రమేష్‌బాబు, సుధాకర్, వనమాల కృష్ణ, వి ప్రభాకర్, కంజర్ భూమయ్య మద్దతు తెలిపి మాట్లాడారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు వై ఓమయ్య, శంకర్ గౌడ్, ముత్యన్న, భూమయ్య, శివ, శివరాజ్, గోవర్ధన్, నర్సింగ్‌రావు, కటారి రాములు, కృష్ణ, నర్సయ్య, కార్మికులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న వివిధ సంఘాల నాయకులు, కార్మికులు

ఈత మొక్కలతో ఉపాధి పొందాలి

పెర్కిట్: గీత కార్మికులు ఈత మొక్కలను జాగ్రత్తగా సంరక్షించి ఉపాధి పొందాలని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ దశరథ్ అన్నారు. ఆర్మూర్ మండలం గోవింద్‌పేట్‌లో గురువారం ఎక్సైజ్ శాఖ, గీత కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఈత మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం గీత కార్మికుల సంక్షేమం కోసం కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఆర్మూర్ ఎక్సైజ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ స్టీవెన్సన్, ఎస్సైలు గంగాధర్, ప్రమోద్, చైతన్య, చంద్రమౌళి, ఉప సర్పంచ్ గంగాధర, ఎంపీటీసీ యాల్ల రాజ్‌కుమార్, సొసైటీ చైర్మన్ మహిపాల్, జిల్లా గౌడ సంఘం అధ్యక్షుడు యాదాగౌడ్, రామా గౌడ్, అంజా గౌడ్, శేఖర్ గౌడ్ పాల్గొన్నారు.



చేనేత వస్త్రాలు సౌకర్యవంతం

- కలెక్టర్ జితేష్ వి పాటిల్

కామారెడ్డి క్రైం: చేనేత వస్త్రాలు సౌకర్యవంతంగా ఉంటాయని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో చేనేత జౌళి శాఖ, డీఆర్‌డీవోల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చేనేత స్టాల్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నేత వస్త్రాలు శరీరానికి చల్లదనాన్ని అందిస్తాయన్నారు. ప్రతి ఒక్కరు వారంలో రెండు రోజులు ధరించాలని సూచించారు. అదనపు కలెక్టర్ చంద్రమోహన్, డీఆర్‌డీవో సాయన్న, డీపీఎంలు రమేష్ బాబు, రవీందర్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సేవలు వెలకట్టలేనివి



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఆకుల లలిత తదితరులు

- టీఎస్‌డబ్ల్యూసీడీసీ చైర్‌పర్సన్ ఆకుల లలిత

మోపాల్: గ్రామాల్లో పిల్లలు, గర్భిణులు, బాలింతల బాగోగులు చూసే అంగన్‌వాడీ టీచర్ల సేవలు వెలకట్టలేనివని టీఎస్‌డబ్ల్యూసీడీసీ చైర్‌పర్సన్ ఆకుల లలిత పేర్కొన్నారు. గురువారం మండలంలోని మంచిప్ప రైతువేదికలో పోషణ్ అభియాన్‌లో భాగంగా ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు–2023 కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా తల్లిపాల వారోత్సవాల పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం గర్భిణులకు సీమంతాలు, చిన్నారులకు అన్నప్రాసన, తదితర కార్యక్రమాలు నిర్వహించారు. అంతకుముందు ఆకుల లలిత మాట్లాడుతూ బిడ్డ పుట్టిన వెంటనే తల్లి పాలు తాగించాలని, ముర్రపాలు బిడ్డకు ఎంతో శ్రేయస్కరమని తెలిపారు. రెండేళ్ల వరకు బిడ్డకు తల్లిపాలు తాగించాలని, రోగనిరోధక శక్తి పెరుగుతోందని వివరించారు. పాలివ్వడంతో బిడ్డకు ఎంత ప్రయోజనం చేకూరుతుందో.. తల్లికి అంతే ప్రయోజనం కలుగుతుందని చెప్పారు. తల్లి పాలతో నవజాత శిశువుల మరణాల సంఖ్య గణనీయంగా తగ్గుతోందని, పిల్లల అభివృద్ధికి దోహదపడుతోందన్నారు. అంతకుముందు పిల్లల వైద్యుడు దీపక్ రాథోడ్ తల్లి పాలతో కలిగే ప్రయోజనాలను ప్రొజెక్టర్ ద్వారా వివరించారు. అనంతరం అతిథులను డీడబ్ల్యూవో రసూల్ బీ సన్మానించారు. మహిళా కమిషన్ సభ్యురాలు సూదం లక్ష్మి, సీడీపీవో సౌందర్య, సర్పంచ్ సిద్ధార్థ, కో ఆప్షన్ మెంబర్ అజీమ్, మెడికల్ ఆఫీసర్ ఆశిష్, వీడీసీ అధ్యక్షుడు నవీన్ తదితరులు పాల్గొన్నారు.

పేరు మార్చారు



సుభాష్‌నగర్: 'అధికారి మారినా.. పేరు మారలేదు' అని 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. కలెక్టరేట్‌లోని సమాచార హక్కు చట్టం బోర్డుపై అదనపు కలెక్టర్ పేరు యాదిరెడ్డి అని మార్చారు.

సాక్షి ఎఫెక్ట్..

సాంఘిక బహిష్కరణ ఎత్తేయాలి

ఆర్మూర్‌టౌన్: కోమన్‌పల్లి గ్రామంలో గొల్లకుర్మ, నాయకపోడ్ కులాలకు చెందిన 52 కుటుంబాలపై వీడీసీ విధించిన సాంఘిక బహిష్కరణను ఎత్తివేయాలని యాదవ సంఘం జిల్లా అధ్యక్షురాలు మంజుల యాదవ్ డిమాండ్ చేశారు. గ్రామంలో ప్రభుత్వ పాఠశాల పక్కన గల భూమి పంచనామ విషయంలో సాక్షి సంతకాలు చేసినందకు బహిష్కరించారన్నారు. గురువారం ఆర్మూర్‌లోని ఏసీపీ కార్యాలయానికి గొల్లకుర్మ, నాయకపోడ్ కుటుంబ సభ్యులు వచ్చి వినతిపత్రం అందజేశారు. గ్రామంలో ఎవరు మాట్లాడటం లేదని, పనులకు రానివ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వీడీసీపై చర్యలు తీసుకొని గొల్లకుర్మ, నాయకపోడ్ సభ్యులకు న్యాయం చేయాలని కోరారు. అశోక్‌యాదవ్, నిమ్మ పోశెట్టి, దశరథ్ పాల్గొన్నారు.



ఏసీపీ కార్యాలయానికి వచ్చిన గొల్లకుర్మ, నాయకపోడ్ కులస్తులు

వీడీసీకి సంబంధం లేదు

కోమన్‌పల్లిలో గొల్లకుర్మ, నాయక్‌పోడ్ కుటుంబాల బహిష్కరణకు వీడీసీకి సంబంధం లేదని వీడీసీ నాయకులు పేర్కొన్నారు. గురువారం వారు తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో విలేకరులతో మాట్లాడారు. వీడీసీ సభ్యులు ఎవరి వద్ద డబ్బులు అడగలేదని, ఎవరికి జరిమానా సైతం వేయ్యలేదన్నారు. ఎవరిని బహిష్కరించలేదని చెప్పారు. వీడీసీ అధ్యక్షుడు రోహన్‌గౌడ్, ప్రశాంత్, చిన్నరాములు సభ్యులు పాల్గొన్నారు.

అన్ని రంగాల్లో అగ్రగామిగా తెలంగాణ

- మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి



డ్రైవింగ్ లైసెన్స్‌లు అందజేస్తున్న మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి

వేల్పూర్: కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణాను అన్ని రంగాల్లో అగ్రగామిగా చేసిన ఘనత సీఎం కేసీఆర్‌దేనని రోడ్లు భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని లక్కోర వద్ద గురువారం సాయంత్రం నియోజకవర్గంలో యువతకు బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఉచిత డ్రైవింగ్ లైసెన్స్‌లు అందజేసే కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. నాడు అంధకారంలో ఉన్న తెలంగాణ నేడు వెలుగులతో విరాజిల్లుతోందన్నారు. కేటీఆర్‌తో వేల పరిశ్రమలు వచ్చాయని, లక్షల మంది యువకులకు ఉద్యోగాలు వచ్చాయని చెప్పారు. బాండ్ పేపర్ రాసిచ్చి పసుపు రైతులను మోసం చేసిన ఎంపి అర్వింద్ ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారని విమర్శించారు. ప్రజలను మభ్యపెడుతూ, ప్రజల కోసం పనిచేస్తున్న వారిని తిట్టే పనిగా పెట్టుకున్న అర్వింద్‌కు యువత బుద్ధి చెప్పాలన్నారు. బాల్కొండ నియోజకవర్గ ప్రజలే తన కుటుంబమన్నారు. నాయకులు డాక్టర్ మధుశేఖర్, కోటపాటి నర్సింహ నాయుడు, డీసీసీబీ వైస్ చైర్మన్ రమేశ్‌రెడ్డి, ఎంపీపీ బీమ జమున పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన రన్



ర్యాలీని జెండా ఊపి ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌వో సుదర్శనం

నిజామాబాద్‌నాగారం: ఎయిడ్స్‌పై అవగాహన కల్పించడానికి గురువారం నగరంలో చేపట్టిన 5కే రన్‌ను కోర్టు చౌరస్తాలో డీఎంహెచ్‌వో సుదర్శనం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఎయిడ్స్‌కు నివారణ ఒక్కటే మార్గమని, ప్రజల్లో అవగాహన కల్పించేందుకే రాష్ట్ర స్థాయి, జిల్లా స్థాయిలలో ఈ 5కే రెడ్ రన్ నిర్వహించామన్నారు. అలాగే క్విజ్ పోటీలు, షార్ట్ ఫిల్మ్, స్కిట్ పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. 5కే రన్‌లో గెలిచిన వారికి ట్రాఫిక్ సీఐ రాథోడ్ బహుమతులు అందజేశారు. జిల్లా యూత్ కో ఆర్డినేటర్ శైలి బెల్లాల్, వైద్యాధికారులు సంతోష్, ప్రవీణ్, డీపీఎం సుధాకర్, టీబీ, హెచ్ఐవీ కో ఆర్డినేటర్ రవిగౌడ్, ఆరోగ్య విస్తరణాధికారి వెంకటేష్, మధుకర్ పాల్గొన్నారు.

చెట్లను నరికిన వారిపై చర్యలు



ఎల్లారెడ్డి: అటవీ ప్రాంతంలో అక్రమంగా చెట్లను నరికిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని ఫారెస్ట్ డివిజనల్ ఆఫీసర్ గోపాల్‌రావు అన్నారు. గురువారం ఎల్లారెడ్డి అటవీశాఖ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. లింగంపేట మండలంలోని ఎక్కపల్లి శివారు అటవీ ప్రాంతంలో చెట్లను నరికిన వారిపై అటవీ శాఖ చట్టం కింద కేసులు నమోదు చేయడంతో పాటు, పోలీసులకు సైతం ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఎఫ్ఆర్‌వో ఓంకార్ తదితరులున్నారు.



● పురివిప్పిన మయూరం

బోధన్ మండలంలోని నాగన్‌పల్లిలో గురువారం నెమలి పురివిప్పి నాట్యం చేసింది. పురి విప్పిన మయూరాన్ని ప్రజలు ఆసక్తిగా తిలకించారు. - బోధన్‌టౌన్

క్రైం కార్నర్

టాటా ఏస్ బోల్తా



తాడ్వాయి: తాడ్వాయి శివారులో గురువారం తెల్లవారుజామున కూరగాయల లోడ్‌తో వెళ్తున్న టాటా ఏస్ వాహనం అదుపు తప్పి బోల్తా పడింది. మహారాష్ట్రలోని లాతూర్ నుంచి కూరగాయల లోడ్‌తో వస్తున్న వాహనం తాడ్వాయి దాటిన తర్వాత మూలమలుపు వద్ద బోల్తా పడింది. డ్రైవర్‌కు నిద్రరావడంతో వ్యాన్ రోడ్డు కిందికి పోయి బోల్తా పడింది. ప్రమాదంలో డ్రైవర్‌కు ఎలాంటి గాయాలు కాలేదు.

గల్ఫ్ ఏజెంట్‌పై చీటింగ్ కేసు

మోపాల్: బోధన్‌కు చెందిన ఎండీ బషీర్‌పై చీటింగ్ కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాము గురువారం తెలిపారు. బషీర్ డిచ్‌పల్లిలో మస్కట్ ఏజెంట్‌గా చేస్తూ ఆఫీస్ ప్రారంభించాడు. చుట్టుపక్కల గ్రామాల్లో అమాయక ప్రజల నుంచి రూ.30వేల నుంచి రూ.40వేల వరకు వసూలు చేశారు. అలాగే మోపాల్ మండలంలో కూడా సుమారు 15 మంది బాధితులు ఉన్నారు. కంజర్‌కు చెందిన అదరంగి అజేంద్రపాల్ బషీర్‌కు డబ్బులు చెల్లించాడు. డబ్బు తీసుకున్న తర్వాత బషీర్ ఫోన్ స్విచ్ఆఫ్ చేయడంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

రోడ్డు ప్రమాదంలో హోంగార్డు మృతి



మగ్గిడి జలంధర్(ఫైల్)

మోర్తాడ్/బాల్కొండ: ఏర్గట్ల మండలం తాళ్లరాంపూర్‌కు చెందిన హోంగార్డు మగ్గిడి జలంధర్(38) రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ గురువారం తెల్లవారుజామున మరణించాడు. బాల్కొండ పోలీసు స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న జలంధర్ బుధవారం తన స్వగ్రామానికి వచ్చి వెళ్తుండగా తడపాకల్ సమీపంలో ఎదురుగా వచ్చిన మరో వాహనం ఢీకొంది. తీవ్రంగా గాయపడిన అతడిని మెరుగైన చికిత్స కోసం నిజామాబాద్‌లోని ఒక ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మరణించాడు. జలంధర్‌కు భార్య కూతురు, కొడుకు ఉన్నాడు. జలంధర్ రోడ్డు ప్రమాదానికి గురి కావడానికి తడపాకల్‌కు చెందిన ఒక బాలుడు కారణం అని పోలీసులు అనుమానిస్తున్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మశ్చేందర్‌రెడ్డి తెలిపారు. బాల్కొండ మండల కేంద్రంలో గురువారం సాయంత్రం అంత్యక్రియలు నిర్వహించారు. ప్రమాదానికి కారణమైన వ్యక్తిని అరెస్ట్ చేయాలని జలంధర్ బంధువులు ఆందోళన చేయగా ఆర్మూర్ ఏసీపీ జగదీష్ చందర్ కుటుంబ సభ్యులకు న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో అంత్యక్రియలను నిర్వహించారు. హోంగార్డు మృతదేహం వద్ద కాంగ్రెస్ నాయకుడు ముత్యాల సునీల్‌రెడ్డి నివాళులు అర్పించారు.

గతంలో అన్న..

ఏర్గట్ల మండలంలోని గుమ్మిర్యాల్ శివారులో గతంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో జలంధర్ అన్న కామారెడ్డి జిల్లాలో హోంగార్డుగా పని చేస్తున్న సహదేవ్ మూడేళ్ల కింద మరణించాడు. ఇప్పుడు జలంధర్ రోడ్డు ప్రమాదంలో మరణించడం వారి కుటుంబాన్ని విషాదంలో ముంచెత్తింది. ఇద్దరు సోదరులు హోంగార్డులుగా పని చేస్తు తమ సొంత మండలంలోనే రోడ్డు ప్రమాదంలో మరణించడం విషాదకరం.

నివాళులు అర్పించిన డీసీపీలు

ఖలీల్‌వాడి: జలంధర్ మృతదేహానికి జీజీహెచ్‌లోని పోస్టుమార్టం గది వద్ద అదనపు డీసీపీలు జయరామ్, గిరిరాజు నివాళులు అర్పించారు. వారి కుటుంబ సభ్యులను ఓదార్చారు.

బస్సు ఢీకొని ఒకరికి గాయాలు

రుద్రూర్: రుద్రూర్ మండలం అక్బర్‌నగర్ శివారులో గురువారం రాత్రి బస్సు ఢీకొని ఒకరికి గాయాలయ్యాయి. రుద్రూర్‌కు చెందిన శంకర్ బైక్‌పై వెళ్తుండగా బస్సు ఢీకొంది. క్షతగాత్రుడిని 108లో బోధన్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

ఆటో బోల్తాపడి పలువురికి..



గాంధారి: గాంధారి సమీపంలో గురువారం ఆటో బోల్తా పడి పలువురికి గాయాలైనట్లు 108 ఈఎంటీ సురేష్ తెలిపారు. పది మంది ప్రయాణికులతో గాంధారి నుంచి బూర్గుల్ వెళ్తున్న ఆటో అదుపు తప్పి రోడ్డు పక్కన బోల్తా పడింది. ప్రమాదంలో తీవ్ర గాయాలైన నేనావత్ రమేష్, రాధ, సంతోష్, రేణాను కామారెడ్డి ఏరియా ఆస్పత్రిలో చేర్పించినట్లు ఆయన తెలిపారు.